
కథానిక ◆ ఓల్గా

# ఓ పెళ్ళికథ

**ఆడపిల్లకు పెళ్ళి కుదిరితే చదువక్కర్లేదు. మగపిల్లాడికి చదువు ముగిసేదాకా పెళ్ళక్కర్లేదు. మన ఆలోచనల్లో చాలా మామూలు విషయంగా మారిపోయిన ఈ వివక్షను విశ్లేషించే కథ**



అమ్మయ్య, వచ్చేశావా? నీ కోసం గంట నుంచీ ఎదురుచూస్తున్నాను. తొందరగా కాళ్ళూ చేతులూ కడుక్కుని వంటింట్లోకి రారా, నీతో పని ఉంది."

ఇంట్లోకి వస్తూనే, "చయ్యా చయ్యా చయ్యా చయ్యా" అంటూ కప్పెగిరిపోయేలా పాడుతూ బూట్లు విప్పుకుంటున్న కొడుకును వంటింట్లోంచే పరమానందంగా చూసింది నిర్మల.

ప్రశాంత్ ఆశ్చర్యంగా వంటింట్లోకి నడిచాడు. తనను సామాన్యంగా వంటింట్లోకి రానివ్వని తల్లి తనంతట తాను ఆహ్వానిస్తోంది.

అక్కడి దృశ్యం చూడగానే అర్థమైంది తల్లి తననెందుకు పిలిచిందో. కానీ, మళ్ళీ అదే అర్థం కాలేదు. తననెందుకు పిలిచినట్లో.

"చేతులు కడుక్కొచ్చి సెనగపిండి కలిపెయ్యరా. మిరపకాయ బజ్జీలు నువ్వు చేస్తే కుదిరినట్లు నే చేస్తే కుదరవు." మిరపకాయల్ని పిన్నీసుతో చీల్చి వాము, ఉప్పు కూరుతోంది.

"ఎవరొస్తున్నారమ్మా?" ప్రశాంత్ ప్రశాంతంగా అడిగాడు.

తాను మిరపకాయ బజ్జీలు బాగా చేయగలడనే వాస్తవం మామూలుగా అయితే తల్లికి పరువు తక్కువ పనిగా, పనికిమాలిన పనిగా కనపడుతుంది. ఎన్నోసార్లు తాను వంట చేస్తుంటే సగంలో చాలు పొమ్మని బైటకు తరిమేసేది. అలాంటిది ఇవాళ తనంత తానే పిలుస్తోంది.

పెద్ద కారణమే ఉండాలి.

"అరేయ్, నీ మేజోళ్ళు కుళ్ళు కంపు కొడుతున్నాయి. అవి విప్పి అవతల పారేసి తొందరగా చేతులు కడుక్కు రారా." నిర్మల చాలా హడావిడిగా ఉంది.

"అమ్మా, మిరపకాయ బజ్జీలకు అసలు రుచి చెమట పట్టి మురిగ్గా ఉన్న చేతుల్తో చేసినప్పుడే వస్తుంది. అందుకే బండి మీద బజ్జీలకు అంత రుచి. ఏదీ పిండి ఇలా తే" అంటున్న ప్రశాంత్‌ని బలవంతంగా బాత్‌రూమ్‌లోకి నెట్టి తలుపేసింది.

అరగంటలో వేడి వేడి బజ్జీలు నున్నగా, పొడవుగా, అందంగా హాట్‌ప్యాక్‌లో సర్దుకున్నాయి.

"నాకేంటో ఈ నునుపు రాదు. గొగ్గిరి గొగ్గిరిగా వస్తుంది" అంది నిర్మల చాలా విచారంగా వాటివంక చూస్తూ.

"హాత్ మే కమాల్ హై కమాల్. సరేగాని దీప్తి ఏది? మనిద్దరం వంటింట్లో ఇట్లా చెమటలు కక్కుతోంటే అది హాయిగా నవల చదువుకుంటోందా?" తాను పొగలు కక్కడానికి ప్రయత్నించాడు.

"పాపం దాన్నేం అనకురా. దాని తిప్పలు అది పడుతోంది" అంది నిర్మల ముసిముసి నవ్వుల్తో.

ప్రశాంత్ కేదో అనుమానం తోచి చెల్లెలి గదిలోకి వెళ్ళాడు.

దీప్తి సగం అలంకరణలో ఉంది. దీప్తి స్నేహితురాలు సుమ సహాయం చేస్తోంది.

ప్రశాంత్ అనుమానం రూఢి అయింది.

"ఏంటి తల్లీ పెళ్ళి చూపులకు తయారవుతున్నావా" అన్నాడు.

దీప్తి కదలకుండా సుమ చేత మేకప్ వేయించుకుంటూ 'ఊఁ' అంది.

"సిగ్గు లేకపోతే సరి" అన్నాడు నవ్వుతూ.

"దీప్తికి పెళ్ళనగానే ఇంత సిగ్గొస్తే మీరలా అంటారేంటి" అంది సుమ.

"నేను ఆ సిగ్గు గురించి కాదులెండి మాట్లాడేది" అంటూ బైటకి నడిచాడు ప్రశాంత్.

పెళ్ళికొడుకు రాకుండానే పెళ్ళిచూపులు దిగ్విజయంగా జరిగిపోయాయి. రావడానికి పెళ్ళికొడుకు దేశంలో లేడు. అమెరికాలో ఉన్నాడు. ఏకంగా పెళ్ళికే వస్తాడు. తల్లితండ్రుల మాట జవదాటని శ్రీరామచంద్రుడు. అందం, అణకువ ఉన్న అమ్మాయైతే చాలు. కట్నం కూడా అవసరం లేదు. ప్రశాంత్ చేసిన మిరపకాయ బజ్జీలు వేడిగా, కారంగా తింటూ పెళ్ళిపెద్దలీ తియ్యని మాటలు చెప్పి వెళ్ళిపోయారు. ఊరికే వెళ్ళిపోలేదు. పిల్ల నచ్చిందనీ, పెళ్ళి ఖాయమనీ, నెల తిరిగే లోపు ముహూర్తాలు పెట్టించి, పెళ్ళిచేసి కొత్త జంటని హనీమూన్‌కి స్విట్జర్లాండ్ పంపుతామనీ చెప్పి మరీ వెళ్ళారు.

నిర్మల, ప్రసాద్‌లు భూమ్మీద నిలబడ లేకుండా ఉన్నారు. దీప్తి గురించి వాళ్ళకు దిగులుగానే ఉంది.

ఒక్కతే ఆడపిల్ల. ప్రాణంగా పెంచుకున్నారు. మంచి సంబంధం కట్నాలు పోసి తీసుకు రాలేమేమో అని భయపడుతున్నారు. అమ్మాయి చక్కని చుక్క, చిదిమి దీపం పెట్టుకోవచ్చు ఇత్యాదులన్నీ నిజమేగానీ, డబ్బుకి తప్ప ఇవాళా రేపూ దేనికీ విలువ ఉండడం లేదు.

ప్రసాద్ సెక్రటేరియట్‌లో ఒక సెక్షనాఫీసర్‌గా చేస్తున్నాడు. మంచి మనిషి.

అభ్యుదయంగా ఆలోచిస్తాడు. యూనియన్లో చురుగ్గా పనిచేస్తాడు.

తన పని కూడా తాను పెండింగ్ లేకుండా చేస్తాడు.

ఇన్ని మంచి గుణాలున్న వ్యక్తి లంచం పుచ్చుకోవడం నేర్చుకోలేదు.

తోటి వాళ్ళందరూ మంచిగానో చెడ్డగానో లక్షలార్జించి కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేస్తుంటే నీతీ నిజాయితీలంటూ పైసా ముట్టుకోకుండా మడిగట్టుకున్న భర్తమీద ఒక్కోసారి కోపం వచ్చేది నిర్మలకు.

కానీ, ఆమెకూ ఆ పని ఇష్టం లేదు. "ఎలాగో అవుతుంది లెండి. పాపిష్టి డబ్బు వద్దు" అనేది.

కొడుకు కంప్యూటర్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలో ఉన్నాడు. దీప్తి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరింది. ఇద్దరి చదువులూ ఖరీదైనవే.

ఏ నెల జీతం ఆ నెల ఖర్చులకి సరిపోయే సంపాదనతో కూతురి పెళ్ళెలా చేయడమన్న ఆలోచన దీప్తి డిగ్రీ పాసయి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరిన ఈ ఆరు నెలల నుంచీ వాళ్ళను బాగా వేధిస్తోంది. ఈ చదువు పూర్తవనీ అనీ, ప్రశాంత్ ఇంజనీరింగ్ పూర్తయితే ఏదో ఓ దారి దొరుకుతుందనీ దిగుల్ని దాటవేస్తూ వస్తున్నారు.

ఇప్పుడీ సంబంధం దేవుడిచ్చిన వరంలా ఉంది. సంబంధం తెచ్చిన ప్రసాద్ మిత్రుడు శాయిప్రకాష్ నిర్మల కళ్ళకు సాక్షాత్తూ సాయిబాబాలా కనపడుతున్నాడు.

"నీతీ నిజాయితీలతో ఉన్న వాళ్ళను దేవుడు కనిపెట్టి ఉంటాడండీ" అంది నిర్మల భర్తను గర్వంగా మురిపెంగా చూస్తూ.

ప్రసాద్‌కీ గర్వంగానే ఉంది. ఉండదా మరి? తన కుటుంబం మంచిదనీ, తన కూతురు చక్కనిదనీ విని అమెరికా సంబంధం వచ్చింది. కట్న కానుకలు అక్కర్లేదన్నారు.

అబ్బాయి అణకువ, అందం ఉన్న పిల్ల మెళ్ళో తాళిగట్టి హాయిగా బతుకుదామనుకుంటున్నాడు. ఇంకో నెలలో పెళ్ళి జరిగి బరువు దిగడమేకాక, తమ సాంఘిక హోదా పెరుగుతుంది.

నిర్మల నిర్విరామంగా ఫోన్లు చేసి బంధుమిత్రులందరి చెవినా ఈ శుభవార్త వేసేస్తోంది.

దీప్తి సుమను ఆ రోజుకి తన దగ్గరే ఉండిపొమ్మంది. ఇద్దరూ కువకువలాడుతూ పావురాళ్ళు గూళ్ళు చేరినట్టు గదిలో చేరారు.

ప్రశాంత్‌నెవరూ పట్టించుకోవడం లేదు.



హాల్లోకి, చెల్లెలి గదిలోకీ తిరుగుతూ ఉన్నాడు. తల్లితండ్రులు ఫోన్ల మైకంలోంచి ఎంతకూ బయట పడరు.

"అదృష్టమేనండి - కాదా మరి - చదువా - ఇంకేం చదువండీ, నెలలోపలే అమెరికా తీసికెళ్ళిపోతారు. అక్కడేదన్నా కోర్సు చేస్తే చేస్తుంది. అసలు ఆ అవసరం కూడా ఉండదనుకుంటా. అబ్బాయిది సొంత కంపెనీ. చాలా బాగా నడుస్తోంది. బోలెడు సంపాదిస్తున్నాడు."

ఇవే వివరాలు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళకి విసుగు లేకుండా చెప్తున్నారు.

ఆ రోజు ఎవరికీ తిండి సహించలేదు.

మర్నాడు ఆదివారం.

ఈ ఆనందం పంచుకోవడానికి దగ్గరి బంధుమిత్రులు స్వయంగా వచ్చారు. వంటింట్లో స్టవ్ ఆర్పే పని లేకుండా టీలూ, కాఫీలూ తయారు చేసింది నిర్మల. సోమవారం మళ్ళీ మామూలుగా తెల్లారింది.

ప్రసాద్ ఆఫీసుకు తయారవుతున్నాడు. నిర్మల భర్తకూ, కొడుక్కీ భోజనం, బాక్సుల్లోకి చపాతీలూ తయారు చేయడంలో బిజీగా ఉంది. దీప్తి తల్లికి సాయం చేస్తోంది.

"వీడింకా లేవలేదేం" అన్నాడు ప్రసాద్ మంచం మీద ముసుగు వీరుడిలా పవళించిన ప్రశాంత్‌ని చూసి.

"ఏంటో మరి! చూస్తా. ఒళ్ళు వెచ్చబడిందేమో" అంటూ నిర్మల ప్రశాంత్ ముఖం మీద దుప్పటి లాగేసి నుదుటి మీద చెయ్యి వేసి చూసింది. చల్లగానే ఉంది.


ప్రశాంత్ కళ్ళు తెరిచి నవ్వాడు.

"ఏరా కాలేజీ లేదూ."

"ఉంది." ఆవలించాడు.

"మరేమిటీ వేషం. ఎనిమిదిన్నర అయింది." కోపం తెచ్చుకుంది నిర్మల.

"కాలేజీకి వెళ్ళనమ్మా" అన్నాడు మళ్ళీ ముసుగు పెట్టబోతూ.



నిర్మల ఆపింది.

"క్లాసుల్లేవా."

"ఉన్నాయి. ఇవాళొక్క రోజూ ఎగ్గొట్టడం కాదు. నేను చదువు మానేస్తున్నా. కాలేజీకి వెళ్ళనింక."

"ఏడిశావులే. నోర్మూసుకుని లే. నీతో పరాచికాలాడే తీరిక నాకు లేదు." నిర్మల అక్కణ్ణించి పరుగు తీసింది. వంటింట్లో కుక్కర్ ఒకటే మోగుతోంది.

ప్రసాద్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ప్రశాంత్ లేచి, టిఫిన్ తిని పేపర్ చదువుతూ కూర్చున్నాడు. క్లాసులు ఏదో కారణంగా జరగడం లేదనుకుంది నిర్మల.

ప్రశాంత్ రోజంతా పేపర్లూ, నవలలూ చదువుతూ ఇంట్లోనే ఉండిపోయాడు.

వరుసగా రెండు రోజులు అదే తంతు నడిచేసరికి నిర్మలకు అనుమానం వచ్చింది.

"ఏమైందిరా? క్లాసులెందుకు జరగడం లేదు? స్ట్రైక్ చేస్తున్నారా?"

"క్లాసులెందుకు జరగవు? శుభ్రంగా జరుగుతున్నాయి. నేను చదువు మానేశానని చెప్పానుగా."

> "అనాగరికులకూ, ఆటవికులకూ ఇంత రోత పెళ్ళిళ్ళు ఉండవు. అతనెవరో అమెరికాలో ఉండి అణకువ, అందం గల భారతీయ స్త్రీ కోసం కలలు కంటూ ఉంటే దానికి దీప్తి బలికావాలా."

నిర్మలకు మొదటిసారి గుండెల్లో పెద్ద భయం పుట్టుకొచ్చింది.

"ఏమైందిరా? చదువు మానెయ్యడమేమిటి? ఇంజనీరింగ్ ఫైనలియర్లో చదువు మానెయ్యడమేమిటి. ఏం చేశావు కాలేజీలో." కొడుకు ఏ వెర్రి పనులన్నా చేస్తే కాలేజీలోంచి తీసేశారేమోనని దడ పుట్టింది నిర్మలకు.

"నేనేం చెయ్యలేదమ్మా. ఇందులో కాలేజీ వాళ్ళ ప్రమేయం లేదు. నా అంతట నేనే మానేస్తున్నా."

తల్లి ఉద్దేశం గ్రహించాడు ప్రశాంత్.

"ఎందుకు? ఏం పుట్టింది నీకు."

"పెళ్ళి చేసుకుందామని."

నిర్మలకు కోపం ముంచుకొచ్చింది.

"నీకంతా తమాషాగా ఉంది. నాకు ఒళ్ళు మండిపోతోంది. నాన్నగార్ని రానివ్వు చెప్తాను" అని అక్కణ్ణించి వెళ్ళిపోయింది 'వీడితో వాదనేమిటి' అనుకుంటూ.

సాయంత్రం ప్రసాద్ ఇంటికి వచ్చి చెప్పులయినా విప్పలేదు.

"చూశారా, వీడి పిచ్చి గోల" అంటూ వచ్చింది.

మూడు రోజులు కొడుకు ఇంట్లో ఉంటే గుండెల మీద కుంపటి మోస్తున్నట్టే ఉందామెకు. ఆమె ముఖంలో ఆందోళన చూసి ప్రసాద్ కంగారు పడ్డాడు.

"ఏంటి, ఏమైంది" అన్నాడు హడావిడిగా.

"వాడు చదువు మానేశాడు. పెళ్ళి చేసుకుంటాడట."

ప్రసాద్‌కి ఆ మాట చాలాసేపు అర్థం కాలేదు.

భార్య వెర్రితనానికి ఆమె మీద ఇంతెత్తున ఎగిరాడు. ఆమె అంతకంతే ఎత్తున లేచింది. ఇద్దరూ ఒకర్నొకరు సమాధాన పరుచుకొని శాంతించి అసలు సమస్య అర్థం చేసుకునేసరికి అరగంట పైనే పట్టింది.

వీళ్ళ అరుపులు దీప్తి బిక్క చచ్చిపోయి వింటుంటే, ప్రశాంత్ వినోదంగా వింటున్నాడు.

వాదోపవాదాల అనంతరం విషయం అర్థమయ్యాక ప్రసాద్ తాడెత్తున లేచాడు.

కొడుక్కి ఇంకా బుద్ధి రాలేదనుకుంటే, ఆయన ఆగ్రహానికి అంతు లేకుండా ఉంది.

ఇంటర్ అవగానే ఎంసెట్ రాయించడానికి నానా గడ్డీ కరిచాడు.

తెలివైన పిల్లాడు. ఎంసెట్ రాయకుండా కేటరింగ్ టెక్నాలజీలో చేరి పాకశాస్త్రంలో పట్టా పుచ్చుకుని నలుణ్ణీ, భీముణ్ణీ అవుతానంటే ఏం చెయ్యాలి?

బతిమాలీ, బామాలి, నయానా భయానా నచ్చజెప్పేసరికి తాతలు దిగొచ్చారు.

ఎలాగో కంప్యూటర్స్‌లో పట్టా తెచ్చుకుంటాడు. తన కష్టాలు గట్టెక్కిస్తాడనుకుంటే మళ్ళీ ఈ వేషమేంటి? మళ్ళీ వంటపిచ్చి పట్టుకుందా?

మొన్న మిరపకాయ బజ్జీలు వీడిచేత చేయించింది ఆ తల్లి. నిర్మలను మింగేసేలా చూశాడు ప్రసాద్.

కొడుకు వైపు చూడాల్సిన చూపు తనవైపు చూస్తాడెందుకా అని, ఆమె అంతకంతే ఉరిమి చూసింది భర్తను.

ప్రసాద్‌కి అసలు కర్తవ్యం గుర్తొచ్చి, "ఏం చేస్తావురా చదువు మానేసి? మూడేళ్ళు చదివావు. బోలెడు డబ్బు తగలేశావు. ఇప్పుడు మళ్ళీ కేటరింగ్ కోర్సులో చేరతావా? పిచ్చెక్కిందా?"

"నేనే కోర్సులోనూ చేరను." బింకంగా అన్నాడు ప్రశాంత్.

"మరి ఎట్లా బతుకుతావు?" పళ్ళు పటపట కొరికాడు.

"పెళ్ళి చేసుకొని." స్థిరంగా, శాంతంగా జవాబిచ్చాడు ప్రశాంత్.

"పెళ్ళా? తా దూర కంత లేదు మెడకో డోలని - నీకో తాడూ బొంగరం లేదు. నిన్నెంత కాలం మేపాలా అని మేం చస్తుంటే, ఇక నీ పెళ్ళాన్ని కూడా మేపమంటావా?" వెటకారం కలిపి నోట్లో నూరేశాడు ప్రసాద్.

"నన్ను నా పెళ్ళాం మేపుతుంది. మీ బరువు తగ్గుతుంది గానీ పెరగదు." ప్రశాంత్ చెక్కు చెదరడం లేదు.

"నిన్ను మేపే పెళ్ళాం ఎవర్రా? పిల్లను చూసుకున్నావా?" నిర్మలకూ, తనకూ తెలియకుండా కొడుకు ఏ ఏ ఘనకార్యాలు చేశాడోనని భయం ముంచుకొచ్చింది.

ఇద్దరు, ముగ్గురు ఉన్నారమ్మా. చాలా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. నన్ను చేసుకోమంటే సంతోషంగా ఒప్పుకుంటారు. మీరు వాళ్ళను చూసి ఏదో ఒకటి సెటిల్ చెయ్యండి. అందరూ మన కులం వాళ్ళే! మీరు భయపడక్కర్లా".

ప్రసాద్‌కీ, నిర్మలకూ సమస్య ఏమిటో, దాన్నెట్లా అర్థం చేసుకోవాలో తెలియలా. చేతికందుతున్న కొడుకు చదువు చట్టుబండలు చేసి, ఈ పెళ్ళి పేలాలేగిస్తాననటాడేమిటి?"

"నీకు పెళ్ళికి తొందరగా ఉంటే చేసుకోరా. మంచి సంబంధం అయితే మేం మాత్రం కాదంటామా? దానికోసం చదువెందుకు మానాలి? ఆ పిల్ల ఉద్యోగం చేసి సంపాదిస్తుంటే నువ్వేం చేస్తావు?"

వాళ్ళిద్దరి బుర్రలూ ఆ వేడిని తట్టుకోలేక సామరస్య ధోరణిలోకి దిగారు.

> "అన్నాయ్, ఎనిమిదిన్నర అయింది. మాకు స్పెషల్ క్లాసుందని నుమకు ఫోన్ చేస్తే చెప్పింది." చేతిలో పుస్తకాలతో సరస్వతిలా నించున్న చెల్లెల్ని చూసి ప్రశాంత్ ముఖం వెయ్యి వాట్ల బల్బయింది.

"ఏం చేస్తానా? వంట చేస్తాను. ఇల్లు దిద్దుకుంటాను. ఆమెకు సేవలు చేస్తాను. ఆమె పిల్లల్ని కనిస్తే పెంచుతాను."

భవిష్యత్ ప్రణాళికను ఆత్మవిశ్వాసం ఉట్టి పడుతుండగా ప్రకటించాడు ప్రశాంత్.

"ఛీ! సిగ్గు లేదూ" ఇద్దరూ ఒక్కనోటితో ఛీత్కరించారు.

"ఎందుకు సిగ్గు?"

"ఆడది సంపాదిస్తుంటే తిని కూచుని." ఇక ఆపై తమ నోటితో చెప్పలేక ఆగారు.

"నేను తిని కూచోను. అమ్మ తిని కూచుంటోందా? రేపు దీప్తి తిని కూచుంటుందా? ఎంత పనుంటుంది ఇంట్లో."

"ఆడదానిలా, మగాడివి."

"నాన్నా." ఇప్పుడు ప్రశాంత్‌కొచ్చిన కోపం ముందు అంతకు ముందు వాళ్ళిద్దరికీ వచ్చిన కోపాలు దిగదుడుపే. ముగ్గురూ ఆ కోపానికి నివ్వెరపోయారు. నిశ్శబ్దమయ్యారు.

"నాన్నా, సీరియస్‌గా చెప్తున్నాను. నేను ఒకటి నమ్మి ఒకటి చెప్పను. ఒకటి చెప్పి ఒకటి చెయ్యను. నేను ఆడా మగా సమానం అని నమ్ముతాను. ఎవరు ఏ పనైనా చేయొచ్చని నమ్ముతాను. సోకాల్డ్ ఆడపనులు చేయడానికి నాకు లేని అభ్యంతరం మీకెందుకు? నాకీ చదువు మీద అంత ఆసక్తేం లేదు. నాకిష్టమయిన పని, నా బతుకుదెరువూ నేను చూసుకుంటాను."

ప్రసాద్‌కి ఎక్కడో ఏదో వెలిగింది. ఏదో అర్థమవుతున్నట్టుగా ఉంది. కాస్త శాంతించాడు. అర్థమైంది. 'ఇదా వీడి గొడవ'.

నిర్మల కొడుక్కి ఘాటుగా సమాధానం ఇవ్వబోతుంటే ఆపేశాడు.

"ప్రశాంత్, దీప్తి ఇద్దరూ ఇలా రండి. కూచుని మాట్లాడుకుందాం" అని పిలిచాడు.

అందరూ డైనింగ్ టేబిల్ చుట్టూ కూచున్నారు.

"దీప్తి పెళ్ళి గురించి నీ అభ్యంతరం ఏమిటో చెప్పరా."

కొడుకు కిటుకు పట్టేశాననే గర్వం ఉంది ప్రసాద్ మాటల్లో.

"అదేంటండీ, మధ్యలో దీప్తి పెళ్ళి సంగతెందుకు? దానికి వీడి అభ్యంతరం ఏమిటి?"

కొడుకు ఏటికి పెడితే భర్త కాటికి పెడుతున్నాడనిపించి విలవిలలాడింది నిర్మల.

"నీకు అర్థం కాలేదా నిర్మలా. వీడి బాధంతా దీప్తి పెళ్ళి గురించి. వాడి గురించి కాదు."

తండ్రికి అర్థమైందని ప్రశాంత్‌కి అర్థమైంది.

దీప్తి అందరి వంకా చూస్తోంది.

"ఏంట్రా నీ అభ్యంతరం?" ప్రసాద్ రెట్టించాడు.

"అన్నీ అభ్యంతరాలే" అన్నాడు ప్రశాంత్.

"ఉదాహరణకు ఒక్కటి చెప్పు."

"ఒక్కటేమిటి? అసలు మొత్తం విషయమంతా పరమ అనాగరికంగా, ఆటవికంగా ఉంది. చాలా తప్పు. అనాగరికులకూ, ఆటవికులకూ ఇంత రోత పెళ్ళిళ్ళు ఉండవు. అతనెవరో అమెరికాలో ఉండి అణకువ, అందం గల భారతీయ స్త్రీ కోసం కలలు కంటూ ఉంటే దానికి దీప్తి బలికావాలా."

"బలా!" నిర్మల నోరు తెరిచింది.

"కాక? అతనేమిటి? మనిషెలా ఉంటాడు? అతని స్వభావమేమిటి? అహంకారా? సాధువా? కోపిష్టా? ఏమీ తెలియదు. అతనసలు కనపడలేదు. ఒక మగాడు ఉన్నాడని తెలిసిందంతే. సిద్ధం చేస్తున్నారు. ఇరవై ఏళ్ళు ప్రాణంగా పెంచిన పిల్లను. ఇరవై ఏళ్ళలో దానికో స్వభావం ఏర్పడింది. ఇష్టానిష్టాలేర్పడ్డాయి. మీ పెంపకంలో ఒక సంస్కారం అలవడింది. అవతలివాళ్ళ సంస్కారం ఏమిటో తెలియకుండా అక్కడికి తోసేస్తారు. మీ ధైర్యానికి మెచ్చుకోవాలి. దీన్ని బలి కాక ఏమంటారు? అసలు ఆలోచించిన కొద్దీ నాకు జుగుప్సగా ఉంది. ఎవరో ముక్కూ ముఖం తెలియని వ్యక్తితో సడన్‌గా పెళ్ళి... సంసారం... అదేంటసలు?"

"మేమంతా అట్లా చెయ్యలేదూ?" నిర్మల అసహనంగా అంది.



"పరమ పాత వాసన కొడుతున్నావమ్మా. అయినా, చెప్తాను. మీ రోజులు వేరు. మీరు కాలేజీల్లో చదివారా? చుడీదార్లూ, జీన్సు ప్యాంటులు వేసుకున్నారా? రాత్రి పదింటి వరకూ స్నేహితుల్తో సిటీ అంతా చెడ తిరిగారా?"

దీప్తి ముఖం ఎర్రగా అయింది. ప్రశాంత్ శాంతించడం లేదు.

"అరే, ఒక పాలేరు పనికి కుదరాలంటే వెళ్ళి ఆ పొలం, ఇల్లు, ఎన్ని గొడ్లున్నాయి, ఎలాంటి మనుషులు అని స్వయంగా చూస్తాడే. తన జీతం కచ్చితంగా మాట్లాడుకుంటాడే. ఇది వెట్టి. లేదా లాటరీ. నువ్వు జూదం ఆడవు. చెల్లితో ఆడిస్తావా? చదువుకున్న ఆడపిల్లలు తమ గురించి తాము ఆలోచించుకోకూడదా? సగంలో చదువు ఆపేసి ఇక్కడ అందర్నీ వదిలేసి... ఎందుకా తొందర?

అతన్తో, 'మా అమ్మాయి నిన్ను చూడకుండా కుదరదు. నువ్వు వచ్చి మూడు నెలలయినా, ఏడాదైనా ఇక్కడ ఉండి అమ్మాయితో స్నేహం చేస్తే అప్పుడు చూస్తాం. అప్పుడైనా అమ్మాయి చదువు అయ్యేవరకూ పెళ్ళి ప్రసక్తి లేదు' అనెందుకు చెప్పలేకపోయారు?" ఒళ్ళంతా ఒక పక్క వేడెక్కుతుంటే, మరో పక్క చెమటలు దిగజారుతున్నాయి ఆ కుర్రాడికి.

"ఆ మాట చెప్తే బంగారం లాంటి సంబంధం చేజారిపోతుంది. ఎవరో ఒకరు ఎగరేసుకుపోతారు. ఇవాళా రేపూ ఆడపిల్ల పెళ్ళంటే..."

"అమ్మా, పెళ్ళి ఆడపిల్లలకే కాదు, మగపిల్లలకీ అవసరమే." గొంతు పగిలేలా అరిచాడు.

"అయితే, ఏంట్రా దీప్తి పెళ్ళి చేతులారా చెడగొట్టి దాని బతుకు నాశనం చేస్తావా?" నిర్మల ఏడుస్తోంది.

"పెళ్ళి చెడగొడతా కానీ, దాని బతుకు బాగుచేస్తా."

నిర్మల దుఃఖం, కోపం పట్టలేక అక్కణ్ణించి లేచి వెళ్ళబోతుంటే ప్రసాద్ ఆమె చెయ్యి పట్టి ఆపి కూర్చోబెట్టాడు.

కూర్చుని పమిటతో కళ్ళొత్తుకుంటూ, "మరి నీ చదువు ఆపుతానంటావేంటి" అంది దుఃఖంతో పూడిన గొంతును సవరిస్తూ.

"అదే నాకు ఒళ్ళు మండుతోంది. దీప్తి చదువు ఒక్క మాటతో ఆపేసిన మీకు నేను చదువాపడం ఎందుకిష్టం లేదు. దీప్తి మొగుడికి చాకిరీ చేసి తిండి సంపాదించుకోవడం ఇష్టమవుతోందిగానీ నేను నా పెళ్ళానికి చాకిరీ చేసి తిండి సంపాదించుకుంటానంటే సహించలేకపోతున్నారెందుకు? నాకూ, దీప్తికీ ఏమిటి తేడా? తేడా ఉంటే దానికి దీప్తి సిగ్గుతో చావడం లేదేం? కోపంతో తిరగబడడం లేదేం?"

"ఆడా, మగా ఒకటేనా?

"ఒకటే. ఒకటే. ఒకటే."

ప్రసాద్ నిర్మలనూ, ప్రశాంత్‌నూ ఆపాడు.

"నీ పాయింట్ నాకర్థమయిందిరా. కష్టపడితే మీ అమ్మకు కూడా అర్థమవుతుంది. అర్థమైనా కొంత కష్టపడుతుంది. సరే నీ ప్రకారం చూసినా ఇది దీప్తికి సంబంధించిన విషయం. దీప్తిని ఆలోచించుకోనిద్దాం. ఈ వారం రోజులూ ఈ పెళ్ళి మంచిదని మేం మాట్లాడాం. అదీ కన్విన్స్ అయింది. ఇప్పుడు నువ్వు చాలా నిర్మొహమాటంగా నీ అభిప్రాయం చెప్పావు. దీప్తిని ఆలోచించుకోనిద్దాం. దానికెలా ఇష్టమైతే అలా చేద్దాం."

"దానికేం తెలుసూ?"

"దానికేం తెలుసూ?" తల్లీ కొడుకులిద్దరి నోటా ఒకే మాట, ఒకేసారి వచ్చింది

